

# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
VC NEWS
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ సోమవారం 23 జూన్ 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 333
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధికి సహకరిస్తాం

2లో





2లో..




- ఇరాన్ అణుకేంద్రాలపై శక్తిమంతమైన బీ2 బాంబర్లతో దాడి
- ఫోర్డో అణుశుద్ధి కేంద్రంపై బంకర్ బస్టర్ బాంబులు
- నతాంజ్, ఇస్ఫహాన్‌లపై తోమహాక్ క్షిపణులు
- 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరుతో దాడులు
- 40 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతిదాడి
- బహుళ వార్‌హెడ్ల ఖోరాంశహర్-4 ప్రయోగం
- దద్దరిల్లిన ఇజ్రాయెల్

- పలు భవనాలు నేలమట్టం
- శాంతించాలని ప్రపంచ దేశాల పిలుపు
- చర్చలకు తావే లేదన్న ఇరాన్
- ఆ దేశాధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ
- ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని సూచన
- హర్మూజ్ జల సంధి మూసివేతకు ఇరాన్ యోచన
- రవాణాపై ప్రభావం పడే అవకాశం

### ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్..

శనివారం అర్ధరాత్రిదాటగానే 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'పేరిట ఈ దాడులను చేసింది. అమెరికాలోని మిస్సోరీలోని వైట్‌హ్యాన్ వైమానిక స్థావరం నుంచి ఆరు బీ 2ఏ విమానాల దండు దండయాత్ర మొదలైంది. ఏకధాటిగా 37 గంటలపాటు ప్రయాణించి, మార్గమధ్యంలో గాల్లోనే ఇంధనాన్ని నింపుకుంటూ 11,400 కిలోమీటర్లు ప్రయాణించిమరీ ఫోర్డో, నతాంజ్ అణుకేంద్రాలపై ఒక్కోటి దాదాపు 14,000 కేజీల బరువుండే 14 బంకర్ బస్టర్ బాంబులను పడేశాయి.

# ఇరాన్ అమెరికా యుద్ధం



## 'రేషన్'కు 76,842 మంది అనర్హులు

2లో..

రాష్ట్రంలో అనుమానాస్పద రేషన్ కార్డులపై క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియ పూర్తయింది. గత 6 నెలల్లో రేషన్ తీసుకోనివారి వివరాలను అధికార యంత్రాంగం పరిశీలించింది. ఈ మేరకు లబ్ధిదారుల్లో 76,842 మంది అనర్హులుగా లెక్క తేలింది.

## కాంగ్రెస్ రైతు భరోసా ఎన్నికల స్టంట్.




2లో

ఎన్నికలు ఉంటేనే ప్రభుత్వానికి రైతులు గుర్తుకొస్తారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి.

## 42 శాతం కోసం "యుద్ధం" తప్పదు.

**బీసీలంతా ఎమ్మెల్సీ కవితకు మద్ధతివ్వాలి.**



ఆర్ కృష్ణయ్య పిలుపు.
జూలై 17 నాటి రైల్ రోకోకు పూర్తి మద్ధతిస్తున్నాం.
జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యతో ఎమ్మెల్సీ కవిత భేటీ.

2లో

## ఫోన్ ట్యాపింగ్ నిందితులు జైలుకు వెళ్లడం ఖాయం.

- స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.
- పిసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.
- కేంద్రమంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలి.
- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ డిమాండ్.



2లో

వేగుచుక్క

# 42 శాతం కోసం “యుద్ధం” తప్పదు.

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్:**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం పై “యుద్ధం” తప్పదనీ,
బీసీలంతా ఎమ్మెల్సీ కవితకు మద్ధతివ్వాలనీ జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేస్తున్న బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్ధతు తెలియజేస్తున్నాట్టు ఆయన ప్రకటించారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ సంయుక్తంగా జూలై 17న తలపెట్టిన రైల్ రోకో కార్యక్రమంతో సహా ప్రతీ కార్యక్రమానికి తాము అండగా నిలిచి పాల్గొంటామని, బీసీలంతా ఎమ్మెల్సీ కవిత ఉద్యమంలో భాగస్వాములు కావాలని అన్నారు. ఆదివారం విద్యానగర్ లోని ఆర్ కృష్ణయ్య నివాసంలో ఆయనతో ఎమ్మెల్సీ కవిత భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కల్పించడానికి అసెంబ్లీ పాస్ చేసిన బిల్లును ఆమోదించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచడానికి చేపతుతున్న రైల్ రోకోకు మద్ధతివ్వాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ, అనేక ప్రజాస్వామిక, సామాజిక ఉద్యమాలను కృష్ణయ్య నడిపించారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు కోసం రెండు సంవత్సరాలుగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేసిన దానికి ఫలితంగా రెండు బిల్లులను అసెంబ్లీ ఆమోదించిందని గుర్తు చేశారు. అయితే, రాజ్యాంగంలోని 243(డీ) ప్రకారం ఒక జీవో ఇచ్చి 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఆస్కారం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ పని చేయకుండా నెపాన్ని మొత్తం రాష్ట్రపతిపై తోసేసి రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికల్లోకి వెళ్లే ప్రణాళిక రచించడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల ప్రేమను మాటల్లో వరకే పరిమితం చేస్తూ చేతల్లో చూపించడం లేదని విమర్శించారు. కేబినెట్ సమావేశంలో



స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని లీకులు ఇస్తున్న నేపథ్యంలో ప్రజా వ్యతిరేక విధానాన్ని కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలంటే ప్రజా ఉద్యమాలే మార్గంగా కనిపిస్తోందని, కాబట్టి రైల్ రోకో చేపడుతున్నామని వివరించారు ఓర్ ఏక్ ధక్కా బీసీ బిల్లు పక్కా అని స్పష్టం చేశారు.

**ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ,**

తరతరలాలుగా అన్యాయం జరుగుతున్న బీసీల కోసం కవిత పోరాటం అభినందనీయమని పేర్కొన్నారు. “ఎమ్మెల్సీ కవిత ఉద్యమం ఎవరి కోసం చేస్తున్నారు ? మన కోసమే కదా%ొ% కాబట్టి ఎమ్మెల్సీ కవిత ఉద్యమానికి మనమంతా అండగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ ఉద్యమాన్ని మనం భుజన ఎత్తుకోకపోతే మనకు భవిష్యత్తు లేదు” అని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగం ఇచ్చింది, కానీ దాన్ని ప్రభుత్వం తోసిపుచ్చుతూ ప్రజల దృష్టిని మళ్లీస్తోందని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న చిత్తశుద్ధి ఉంటే జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు చారిత్రక ద్రోహం చేసినట్లవుతుందని స్పష్టం చేశారు. పోరాటం చేయకపోతే భవిష్యత్తులో బీసీల రిజర్వేషన్లు తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తాడోపేడో తేల్చుకోవాల్సిన సందర్భం వచ్చిందని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు పెంచకపోతే బీసీలు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తప్పనిసరిగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు జరపాలని, లేదంటే రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు.

# కాంగ్రెస్ రైతు భరోసా ఎన్నికల స్టంట్.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 22:**

కాంగ్రెస్ రైతు భరోసా కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనని, ఓట్ల సమయంలోనే రైతులకు పథకాలు వర్తింపజేస్తుంది అని, ఓట్లు లేకుంటే రైతులకు ఇచ్చే పథకాలను ఎగ్గొడుతు, వాటి ఊసు ఎత్తడం లేదు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచంలోనే రైతులకు డైరెక్ట్ గా నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టిన రైతు బాంధవుడు కేసీఆర్ అన్నారు. మొదటిసారి నేరుగా రైతులకు పంట పెట్టుబడి సాయం కింద రైతులు నాట్లు వేసేటప్పుడే కేసీఆర్ రైతు బంధు ఇచ్చాడని, రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లప్పుడు మాత్రమే రైతుబంధు ఇస్తున్నాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు పంట సీజన్ లు వచ్చాయని, మొదటిసారి ఎంపీ ఎన్నికలు ఉండటం వల్ల రైతు బంధు ఇచ్చాడని తెలిపారు. అవి కూడా కెసిఆర్ రైతు బంధు కోసం ఉంచిన డబ్బులే ఇచ్చాడన్నారు. రెండోసారి ఏ ఎన్నికలు లేనందు వల్ల రైతు భరోసా ఎగ్గొట్టాడన్నారు.
మూడోసారి ఏ ఎన్నికలు లేనందున తూతూ మంత్రంగా 3 ఎకరాల వరకు ఇచ్చి మిగితా వారికి ఎగ్గొట్టాడని తెలిపారు. నాలుగవ సారి స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న దృష్ట్యా ఇప్పుడు రైతు బంధు ఇస్తున్నాడన్నారు. ఎన్నికలు ఉంటే రైతు బంధు.. ఎన్నికలు లేకుంటే రైతుబందు లేదు.. ఇది కాంగ్రెస్ నైజం.. రైతులు గమనించాలి.. కేవలం ఎన్నికల కోసం రైతు భరోసా వేసి రైతు లను మోసం చేసి ఓట్లు తీసుకునే ప్రయత్న రేవంత్ రెడ్డి చేస్తున్నాడని అన్నారు. రుణమాఫీపై ఎన్నికల్లో ఇచ్చిన హామీ తుంగలో తొక్కాడని, డిసెంబర్ 9న మాఫీ అని చెప్పి మాట
తప్పిండని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో దేవుళ్ళ మీద ఓట్లు పెట్టి పూటకో తేదీ చెప్పుకుంటూ వాయిదాలు వేశాడని తెలిపారు. చివరికి బిఆర్ఎస్ ఒత్తిడి తో సగం మందికి రుణమాఫీ చేసి మిగతా సగం మంది రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టాడన్నారు. ఎన్నికల మానిఫెస్టో లో చెప్పిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఎకరానికి 7వేల 500లు లెక్కన ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొదటి సారి రైతు భరోసాకు కేసీఆర్ ఉంచిన 5000 మాత్రమే ఎకరానికి ఇచ్చి 2500 ఎగ్గోట్టాడన్నారు. ఇప్పటికే ఎగ్గొట్టిన రైతు భరోసా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కానీ రైతులందరికి 2 లక్షలు రుణమాఫీ చేయాలన్నారు. అన్ని రకాల వడ్లకు పాత సీజన్ లతో సహా రూ.500 బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు. రైతులకు ఇప్పటికే బాకీ ఉన్న డబ్బులు ఇచ్చినంకనే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు ఓట్లు అడగాలి లేకపోతే రైతులు మీ పై తిరగబడటం ఖాయం అని కాంగ్రెస్ పార్టీ ని ఎమ్మెల్యే వేముల హెచ్చరించారు.

# క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధికి సహకరిస్తాం

హైదరాబాద్: ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు ఆదివారం జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని దత్తాత్రేయుడు అభినందించారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధికి అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలిపారు.



# ఫోన్ ట్యాపింగ్ నిందితులు జైలుకు వెళ్లడం ఖాయం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 22:**

ఫోన్ ట్యాఫింగ్ లో బాగం పంచుకున్న ప్రతి ఓక్కరూ జైలుకు వెళ్లడం ఖాయమని పిసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అదివారం నిజామాబాద్ లో పిసీసీ చీప్ మహేష్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ఇంకా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలలో కీలకమైన బనక చర్ల విషయంలో వెనక్కి తగ్గేది లేదని మహేష్ కుమార్ గౌడ్ తేల్చి చెప్పారు. నాయకులు, పారిశ్రామిక వేత్తలు, జడ్జీలు, సినీ తారలు, బడా నాయకుల ఫోన్ లు 650 ట్యాప్ చేసిన నీచమైన



చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని అన్నారు. దేశ చరిత్ర లోనే అతి పెద్ద నేరం ఫోన్ ట్యాపింగ్ అని అందులో భాగం పంచుకున్న ప్రతీ ఒక్కరూ జైలుకు వెళ్ళక తప్పదన్నారు.
సిట్ విచారణ పై నమ్మకం లేదన్న బండి సంజయ్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలనీ, కేంద్ర మంత్రి హెూదాలో చట్టాలపై నమ్మకం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందనీ ప్రభుత్వం సలహాదారుడు షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు.




టెహ్రాన్/టెల్ అవీవ్/వాషింగ్టన్/న్యూఢిల్లీ/మాస్కో: పచ్చగడ్డి వేస్తే భగ్గున మండే శత్రుత్వంతో పరస్పర దాడులు చేసుకుంటున్న ఇరాన్, ఇజ్రాయెల్ మధ్యలోకి అగ్రరాజ్యం హఠాత్తుగా వచ్చి భీకరదాడులతో పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలను మరింత ఎత్తుకు ఎగదోసింది. పర్వతగర్భంలో పటిష్టంగా, రహస్యంగా ఉన్న ఫోర్డో యురేనియం శు ద్ధి కర్మాగారాన్ని బద్దలుకొట్టే లక్ష్యంతో అమెరికా యుద్ధవిమానాలు వేల కేజీల బరువైన అతిభారీ బాంబులతో విరుచుకుపడ్డాయి.
ఇరాన్ రాజధాని సమీప ఫోర్డో అణుకేంద్రంపై శనివారం అర్ధరాత్రిదాటాక గంటలకు జీబీయూ%-%57 ఏ/బీ మ్యాసివ్ ఆర్డ్‌నెన్స్ పెనిట్రేటర్(ఎంఓపీ) గైడెడ్ బాంబులను అమెరికా బీ2ఏ స్పిరిట్ స్టెల్త్ బాంబర్ విమానాలు జారవిడిచాయి. ఈ బాంబులు 200 అడుగుల లోతుకు చొచ్చుకెళ్లి అక్కడి భూగర్భాన్ని బద్దలుకొట్టాయి. నతాంజ్ అణుకేంద్రంపైనా అమెరికా ఇవే బాంబులను వేసింది. మొత్తంగా 14 జీబీయూ బాంబులను ఉపయోగించినట్లు అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్, జనరల్ డేనియల్ కెయిన్ వెల్లడించారు.
ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్..
శనివారం అర్ధరాత్రిదాటగానే ‘ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్’పేరిట ఈ దాడులను చేసింది. అమెరికాలోని మిస్సోరీలోని వైట్‌హ్యాన్ వైమానిక స్థావరం నుంచి ఆరు బీ%-%2ఏ విమానాల దండు దండయాత్ర మొదలైంది. ఏకధాటిగా 37 గంటలపాటు ప్రయాణించి, మార్గమధ్యంలో గాల్లోనే ఇంధనాన్ని నింపుకుంటూ 11,400 కిలోమీటర్లు ప్రయాణించిమరీ ఫోర్డో, నతాంజ్ అణుకేంద్రాలపై ఒక్కోటి దాదాపు 14,000 కేజీల బరువుండే 14 బంకర్ బస్టర్ బాంబులను పడేశాయి. ఆ తర్వాత ఇస్ఫహాన్ అణుకేంద్రంపై అమెరికా జలాంతర్గామి 30 టోమాహాక్ క్రూజ్ క్షిపణులను ప్రయోగించింది. ఈ మూడు అణుకేంద్రాలపై 75 దాకా గైడెడ్ క్షిపణులను ప్రయోగించి విధ్వంసం సృష్టించింది. మొత్తంగా 125 విమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. కొన్ని విమానాలు దాడిచేయగా మిగతావి శత్రుసేనలను తికమక పెట్టేందుకు వేర్వేరు దిశల్లో చక్కర్లు కొట్టాయి. మెరుపువేగంతో దాడులుచేసి తిరిగి తమతమ స్థావరాలకు చేరుకున్నాయి.
యుద్ధ, రవాణా, ఇంధన విమానాలు ఈ ‘ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్’లో పాల్గొన్నాయి. అమెరికా దాడుల్లో అణుకేంద్రాల్లో మౌలికవసతులు ఏ స్థాయిలో నాశనమయ్యాయో ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. అయితే పర్వతం పైభాగంలో ఆరు భారీ రంధ్రాలు పడ్డట్లు తాజాగా తీసిన ‘ప్లానెట్ ల్యాబ్స్ పీబీసీ’ఉపగ్రహ ఫొటోల్లో కనిపించింది.
అయితే అణుబాంబు తయారీని అడ్డుకునేందుకు బాంబులేశామని, ఇరాన్‌లో యుద్ధాన్ని ఎగదోసి, ప్రస్తుత ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశ్యం తమకు లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టంచేశారు. అయితే అణుబాంబు తయారీ సామర్థ్యాన్ని ఇరాన్ సంతరించుకోవద్దనే లక్ష్యంతోనే తాము యుద్ధంలో పాల్గొన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సైనికచర్యను సమర్థించుకున్నారు.
తమపై ప్రతిదాడి చేస్తే మిగతా లక్ష్యాలపై దాడులు తప్పవని ఇరాన్‌ను హెచ్చరించారు. అయితే దాడుల తర్వాత ఆయా అణుకేంద్రాల నుంచి ఎలాంటి అణుధార్మికత వెల్లడైన ఛాయలు కనిపించలేదని అంతర్జాతీయ అణుఇంధన ఏజెన్సీ స్పష్టంచేసింది. దాడికి ముందే అక్కడి నుంచి యురేనియం నిల్వలను తరలించినట్లు ఇరాన్ అధికారులు వెల్లడించారు.
ఊహించనిస్థాయిలో దెబ్బకొడతాం: అబ్బాస్
ఓవైపు అణు మధ్యవర్తిత్వం కోసం స్వాగతం పలుకుతూ మరోవైపు సమరాగ్నిని రాజేస్తున్న అగ్రరాజ్యాన్ని ఊరికే వదిలిపెట్టబోమని ఇరాన్ ప్రతిజ్ఞచేసింది. చరిత్రలో ఎన్నడూలేని స్థాయిలో దాడులుచేసి బదులు తీర్చుకుంటామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు. ఇస్తాంబుల్‌లో జరుగుతున్న ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోపరేషన్ సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన అబ్బాస్ ఆదివారం మీడియాతో మాట్లాడారు.
“దౌత్యనీతిని కాలరాస్తూ అమెరికా మాపై దాడులకు తెగబడింది. మేం దౌత్యాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టి దేశ రక్షణ కోసం భీకరపోరు చేయాల్సిన తక్షణావసరమిది. దుస్సాహసంతో దారుణంగా దాడులు చేసిన యుద్ధోన్మాద అమెరికా తదుపరి తీవ్ర పర్యావసానాలకు బాధ్యతవహించాల్సి ఉంటుంది. అమెరికా చర్యలకు ఇరాన్ తన సైన్యంతో బదులుతీర్చుకుంటుంది.
దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు ఇరాన్ పాటుపడుతుంది”అని అబ్బాస్ అన్నారు. మరోవైపు తమపై దాడిచేసిన ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ ఆదివారం మిస్సైళ్లను ప్రయోగించింది. తన అమ్ములపొదిలోని మధ్యస్థ శ్రేణి ఖుర్రమ్‌షహర్%-%4 క్షిపణిను సైతం ఇరాన్ ప్రయోగించింది. ఇది ఒకేసారి 1,500 కేజీల బరువైన వేర్వేరు వార్‌హెడ్లను ఏకంగా 2,000 కిలోమీటర్లదాకా మోసుకెళ్లగలదు. ఈ క్షిపణిని ఈ యుద్ధంలో వాడటం ఇదే తొలిసారి అని తెలుస్తోంది.

**దాడులను పొగిడిన ఇజ్రాయెల్**

ఇరాన్‌పై అమెరికా దాడి చేయడాన్ని ఇజ్రాయెల్ స్వాగతించింది. ఇదొక అద్భుత, సాహసోపేత, చరిత్రాత్మక ఘటనగా అభివర్ణించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్ మీడియాతో మాట్లాడారు. “దాడులు చేయాలని కోరాం. కానీ అమెరికా నిర్ణయం ముందస్తుగా మాకుతెలీదు. ఇదొక చారిత్రక నిర్ణయం.
అమెరికా నేరుగా దాడులు చేస్తున్నందున ఇక మేం దాడులు చేయబోమని అనుకోవద్దు. ఇరాన్ మా భూభాగాలపై క్షిపణులు వేస్తోంది. మేం వాటికి బదులు చెప్పాలి”అని ఇసాక్ అన్నారు. ఆదివారం సైతం ఇరాన్‌లోని డజనుకుపైగా మిలటరీ స్థావరాలపై దాడులుచేశామని చెప్పారు. అయితే ఆస్పత్రులు, మెడికల్ సెంటర్లపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని ఇరాన్ ఆరోపించింది.
ఆదివారం నాటికి ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా ఇరాన్‌లో 865 మందిదాకా చనిపోయారని, 3,396 మంది గాయపడ్డారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే ‘హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్’సంస్థ ప్రకటించింది. మరోవైపు ఇరాన్ సుప్రీంనేత అయతొల్లా అలీ ఖమేనీని అత్యంత సురక్షిత బంకర్‌కు తరలించినట్లు తెలుస్తోంది. తమ దేశంలో 24 మంది చనిపోయారని, వేయి మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ పాత లెక్కలనే చెబుతోంది

**మద్దతు కూడగట్టే పనిలో ఇరాన్**

ఇరాన్‌పై దాడులను చైనా, రష్యా తీవ్రంగా ఖండించాయి. దాడుల తర్వాత ఇరాన్‌కు ప్రపంచదేశాల నుంచి సైనిక సాయం పెరుగుతుందని రష్యా వ్యాఖ్యానించింది. ఈ మేరకు రష్యా మాజీ అధ్యక్షుడు, దేశ భద్రతామండలి అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదెవ్ ‘ఎక్స్’ లో ఒక పోస్ట్ పెట్టారు. “దాడుల కారణంగా ఆ అణుకేంద్రాలు పెద్దగా దెబ్బతినలేదు. పైగా ఇరాన్‌కు బయటి మద్దతు పెరుగుతోంది. అణువార్‌హెడ్‌లు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి”అని అన్నారు. మరోవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మంతనాలు జరిపేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ ఆదివారం మాస్కోకు వెళ్లారు. భేటీ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.
జలసంధి దిగ్బంధం!!
ప్రపంచ చమురు జీవనాడికి పేరొందిన హెూర్ముజ్ జలసంధిని మూసేస్తామని ఇరాన్ బెదిరించింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయానికి ఇరాన్ పార్లమెంట్
ఆమోదం
తెలపింది. అయితే జాతీయ ప్రయోజనాలపై కీలక నిర్ణయాలు తీసుకునే ‘సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్’ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.
అది కూడా ఆమోదిస్తే జలసంధి ద్వారా ముడి చమురు, సహజవాయువు రవాణా నౌకల రాకపోకలు స్తంభించిపోనున్నాయి. దాంతో ఇంధన కొరత ఎక్కువై, గిరాకీ పెరిగి, పెట్రో ధరలు మరింత అధికంకానున్నాయి. భారత్‌పై దీని ప్రభావం తీవ్రంగా ఉండే ప్రమాదముంది.
మరోవైపు, అమెరికా జోక్యం, బాంబు దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు నెలకొనడంతో ఆదివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్‌తో భారత ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఉద్రిక్తతలపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. చర్చలు, దౌత్యం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ వివరాలను మోదీ తన ‘ఎక్స్’ఖాతాలో వెల్లడించారు.

వేగుచుక్క

# ఇబ్బందులు ఎదురైనా "సంక్షేమ" పథకాలు కొనసాగిస్తాం.



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్.
షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ.
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలు అందజేత.
పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 22**



ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరంగా కొనసాగిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసనమండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి 572 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ఇంద్రపూర్ లోని నగర యాదవ సంఘంలో 261 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సభ్యులు షబ్బీర్ అలీ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ అసంబద్ధ పాలన కారణంగా తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆక్షేపించారు. రూ. 7.50 లక్షల కోట్ల అప్పులపై తమ ప్రభుత్వం ప్రతి నెల రూ. 6500 వేల కోట్లు వడ్డీ కింద చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ. 500 లకే వంటగ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, సన్న బియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే కృతనిశ్చయంతో మొదటి విడతగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఇంటి స్థలాలు కలిగిన పేద కుటుంబాల వారు ముందుకు వస్తే, అర్హత కలిగిన వారందరికీ తప్పనిసరిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. ఐదు లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు. ఇల్లు మంజూరు కోసం ప్రజలు ఎవరు కూడా దళారులను ఆశ్రయించవద్దని, ఎవ్వరికీ నయా పైసా ఇవ్వకూడదని సూచించారు. పార్టీలకు అతీతంగా, పూర్తి పారదర్శకంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు తప్పకుండా మంజూరు చేస్తామని భరోసా కల్పించారు. ప్రస్తుతం మంజూరీ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వ తోడ్పాటుతో త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని, సొంతింటి కలను సాకారం చేసుకోవాలని హితవు పలికారు. కాగా, నగరంలో సొంత స్థలాలు లేని నిరుపేదల కోసం ప్రభుత్వ పరంగా అన్ని వసతులతో కూడిన ఇందిరమ్మ కాలనీలు నిర్మించేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, రాష్ట్ర సహకార యునియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ చైర్మన్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

# మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం.

- పోలీస్ క్రికెట్ మ్యాచ్ ప్రారంభ కార్యక్రమంలో సిపి సాయి చైతన్య వెల్లడి.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 22:**

ప్రతి ఒక్కరికీ మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అన్నారు. పోలీస్ కమిషనర్ గారి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పోలీస్ మైదానంలో అన్ని విభాగాలైన నిజామాబాద్ సబ్ డివిజన్, ఆర్మూర్ సబ్ డివిజన్, బోధన్ సబ్ డివిజన్, ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం, అలైడ్ బ్రాంచులు, హెూమ్ గార్డ్స్ విభాగం మొదలగు విభాగాల మధ్య పోలీస్ క్రికెట్ మ్యాచ్ లు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ప్రజా రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ ఎంతో ఒత్తిడికి గురవుతుంటారని అన్నారు. వారికి క్రీడలు ఎంతో మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని, స్పోర్ట్స్ లో పాల్గొని రిఫ్రెష్ అయిన పోలీసులు తిరిగి మరింత ఉత్సాహంతో విధుల్లో బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. సమయం దొరికినప్పుడు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. పోలీసులు ఉద్యోగ వృత్తిలో ఎంతో బిజీగా గడుపుతామని, క్రీడలు జీవితంలో మానసిక ఒత్తిడిలను తట్టుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో చాలా బాగా రాణిస్తున్నారని, క్రీడాకారులు అందరిలో స్కిల్స్ టాలెంట్ బాగా ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి ప్రజల కోసం పనిచేయాలని, ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ముందు ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో నిజామాబాద్ కమిషనరేట్ కు మంచి పేరు తీసుకురావాలి ఆకాంక్షించారు. ఈ క్రికెట్ మ్యాచ్ రెండు రోజులు నిర్వహించడం జరుగుతుందని క్రీడాకారులు అయినటువంటి పోలీస్ సిబ్బంది చక్కగా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాదు అదనపు పోలీస్ కమీషనర్ ( అడ్మిన్ ) బస్వా రెడ్డి , అదనపు పోలీస్ కమీషనర్ ( ఏఆర్) రామ్ చందర్ రావ్, నిజామాబాదు ఏసిపి రాజా వెంకట్ రెడ్డి , బోధన్ ఏసిపి పి.శ్రీనివాస్ , ఆర్మూర్ ఏసిపి జె. వెంకటేశ్వర్ రెడ్డి , సిఐ లు, ఆర్ఐ లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వినూత్నంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.










## నో ప్లాస్టిక్ తో గెట్ టుగెదర్.

**వేగుచుక్క న్యూస్: నిజామాబాద్**

కాకతీయ జూనియర్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు వినూత్నంగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.కళాశాలలోని 2002 - 2004 సిఇసి బ్యాచ్ విద్యార్థులు నో ప్లాస్టిక్ తో గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ వాడకుండా మోదుగ ఆకులు తో తయారుచేసిన ప్లేట్స్, జొన్న వ్యర్థాలతో తయారు చేసిన గ్లాసెస్, బ్యానర్ ప్లాస్టిక్ తో కాకుండా క్లాత్ బ్యానర్ ఇలా పర్యావరణానికి హాని కలిగించకుండా విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హక్కుల రక్షణకు ఐక్యంగా పోరాడాలి.

**రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొ. లింబాద్రి పిలుపు.**
**ప్రభుత్వాలు సైతం శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆవేదన.**
**టీయుసిఐ రాష్ట్ర మహాసభల్లో భాగంగా రెండవ రోజు కొనసాగిన ప్రతినిధుల సభ.**











**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 22**

కార్మిక హక్కుల రక్షణకు ఐక్యంగా పోరాడాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొ. లింబాద్రి పిలుపునిచ్చారు. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో భాగంగా నగరంలోని ఆర్. ఎన్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం ప్రతినిధుల సభ జరిగింది. ముందుగా టీయూసీఐ జెండాను రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ లింబాద్రి ప్రారంభ ఉపన్యాసం చేస్తూ పోరాటాల వల్లనే హక్కులు దక్కుతాయని, కార్మిక హక్కుల రక్షణ కోసం బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్పొరేట్ కంపెనీలే కాకుండా ప్రభుత్వాలు సైతం శ్రమదోపిడికి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, ఒక గొప్ప సమాజ నిర్మాణం కోసం ఈ మహాసభల వేదికగా చర్చ జరగాలని, ఆ వైపుగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సామ్రాజ్యవాద శక్తులతో మతోన్మాద శక్తులు కలిసి దేశాన్ని పీడిస్తున్నాయి.**

టియుసిఐ ఆల్ ఇండియా అధ్యక్షులు అమ్రిష్ పటేల్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వనమాల కృష్ణ, కే.సూర్యం లు మాట్లాడుతూ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ప్రపంచాన్ని సామ్రాజ్యవాదం పీడిస్తుంటే, మన దేశాన్ని సామ్రాజ్యవాద శక్తులతో కలిసి మతోన్మాత శక్తులు పీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా గాజా, ఇరాన్ లపై ఇజ్రాయిల్, అమెరికా యుధోన్మాద దాడులను ఖండిస్తున్నామన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత ప్రజల ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతున్నదని ఆరోపించారు. మోడీ ప్రభుత్వ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల్ని చైతన్యం చేస్తామన్నారు. దేశంలోని 40 కోట్ల మంది కార్మిక వర్గం మోడీ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా నిరసిస్తున్నదన్నారు. వచ్చేనెల 9న కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ద్వారా మోడీ ప్రభుత్వానికి కార్మిక శక్తిని తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్ ఎస్ఎల్ పద్మ, ఎం.హన్మేష్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు కే.రాజన్న, జీ.రామయ్య, సి. వెంకటేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకన్న, రాజేశ్వర్, ముత్తెన్న, మల్లేష్ సత్యక్క రమేష్, యాకుబ్ షావలి, వెంకట్, రెడ్డి, అశోక్, సాంబశివుడు, కిరణ్, ప్రసాద్, హనుమంతు, రాజు, దేవదానం, రామ్ లక్ష్మణ్ తదితరులు మరియు వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సమావేశం.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 22:**

తెలంగాణ రిటైర్డ్పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ నిజామాబాద్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్. నాగేందర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి 30 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో అసోసియేషన్ భవిష్యత్తు ప్రణాళికల గురించి చర్చించారు. అసోసియేషన్ సభ్యులు ఎవరైనా చనిపోయినప్పుడు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ నిజామాబాద్ జిల్లా తరపున రూ. 10వేల ఆర్థిక సహాయం అందించాలని కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ జేఏసీ ఉపాధ్యక్షులు ముత్తారం నర్సింహ స్వామి పాల్గొని పెన్షనర్ల సమస్యలగురించి ప్రసంగించారు.

# షబ్బీర్ అలీ, మహేశ్ కుమార్లతో కలెక్టర్ భేటీ.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూన్ 22 :**





నిజామాబాద్ నగరంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఆదివారం జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసన మండలి సభ్యులు బి. మహేశ్ కుమార్ గౌడ్ లతో జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి భేటీ అయ్యారు. రోడ్లు - భవనాల శాఖ అతిథి గృహం వద్ద వారికి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లతో కలెక్టర్ భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. జిల్లా ప్రగతికి చేపట్టాల్సిన చర్యలు, కొత్త పరిశ్రమల స్థాపనకు అందుబాటులో ఉన్న అవకాశాలు తదితర విషయాలపై పరస్పరం తమ అభిప్రాయాలు పంచుకున్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికార యంత్రాంగం చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందేలా చూస్తామని షబ్బీర్ అలీ, మహేశ్ కుమార్ గౌడ్ లు తెలిపారు. ఈ భేటీలో రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా ఛైర్మన్ కేశ వేణు, సహకార యునియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ చైర్మన్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

# రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 22**



బిటేక్ ఫెయిల్ అయిన యువకుడు, ఆవిషయాన్ని దాచిపెట్టి.. పాస్ అయ్యానని తల్లిధండ్రులు, బందువులకు చెప్పుకున్నాడు. కానీ బిటేక్ ఫేయిల్ అయిన విషయం తెలిసిన తల్లీ ప్రశ్నించడంతో అవమానంగా బావించిన యువకుడు రైలుకిందపడి అత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన అదివారం వెలుగు చూసింది. నిజామాబాద్ రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ నగరంలోని సాయి క్రిపనగర్ కు చెందిన రాజరపు శ్రీనివాస్ (25) బిటేక్ చదివారు. అయితే అందులో ఫేయిల్ అయ్యారు. కాని ఆ విషయం దాచి తల్లిధండ్రులు, బందువులకు తాను పాస్ అయ్యానని చెప్పుకున్నాడు. ఇటీవల ఈ విషయం తెలిసిన తల్లి తన కోడుకును ప్రశ్నించడంతో శ్రీనివాస్ ఈ నెల 21న నిజామాబాద్ - డిచ్ పల్లి రైల్వే స్టేషన్ మద్య గుర్తు తెలియని రైలు కింద పడి అత్మహత్యకు పాల్పడ్డారు. మృతుని తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వేగుచుక్క

# నిర్మాతగా రామ్ పోతినేని..!

హీరోలు నిర్మాతలు అయినంత తేలికగా నిర్మాతలు హీరోలు కాలేరు. కానీ అప్పుడప్పుడు టెక్నీషియన్స్ కూడా హీరోలుగా తమ అదృష్టం పరీక్షించుకుంటూ ఉంటారు. నిజానికి దర్శకులు చాలామంది తమకు నచ్చిన కథను నిర్మాతగా మారితేనే చేయగలమనే నమ్మకంతో ప్రొడ్యూసర్స్ అవుతుంటారు.



హీరోలు కూడా తమకు నచ్చిన దర్శకుడిని, నచ్చిన కథను తెర మీద చూసుకోవడానికి నిర్మాతలుగా మారుతుంటారు. అయితే కొందరు కేవలం తామే హీరోలుగా నటించడం కాకుండా కథానుగుణంగా యంగ్ టాలెంట్ నూ ప్రోత్సహిస్తూ ఉంటారు. నాని అలా 'అ', 'హిట్' చిత్రాలను నిర్మించాడు. 'హిట్ – 3'లో తానే హీరోగా చేశాడు. విజయ్ దేవరకొండ కూడా తనతో 'పెళ్ళిచూపులు' సినిమా తెరకెక్కించిన దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా 'మీకు మాత్రమే చెబుతా' మూవీని తీశాడు. తాజాగా యంగ్ హీరో ఉస్తాద్ రామ్ పోతినేని సైతం నిర్మాతగా మారబోతున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం రామ్ కు గడ్డు కాలం నడుస్తోంది. అతని చిత్రాలన్నీ బాక్సాఫీస్ బరిలో వరుసగా ఫెయిల్ అవుతున్నాయి. 'స్కంద, డబుల్ ఇస్మార్ట్' పరాజయాల నుండి కాస్తంత కోలుకున్న రామ్ ఇప్పుడు 'ఆంధ్రా కింగ్ తాలుకా' సినిమాలో నటిస్తున్నాడు. ఆంధ్రా కింగ్ గా ఉపేంద్ర నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ మహేశ్ బాబు దీనికి దర్శకుడు. ఈ సినిమా కోసం రామ్ గీత రచయితగానూ మారాడు. అలానే త్వరలో నిర్మాత అవుతున్నాడని సమాచారం. విశేషం ఏమంటే... ఇప్పటికే తెలుగు సినిమా రంగంలో రామ్ పెద్దనాన్న రవికిశోర్ 'స్రవంతి మూవీస్' పేరుతో సినిమాలు నిర్మిస్తున్నారు. రామ్ తోనే కాకుండా ఆయన బయటి హీరోలతోనూ సినిమాలు తీస్తున్నారు. అయితే... పెదనాన్న నీడలో కాకుండా తన అభిరుచికి తగ్గట్టుగా సినిమాలు నిర్మించాలని రామ్ భావించాడట. అందుకే ఓన్ బ్యానర్ పెట్టబోతున్నాడని తెలిసింది. తొలి చిత్రం ద్వారా ఓ కొత్త దర్శకుడిని రామ్ పరిచయం బోతున్నాడట. అయితే ఈ సినిమాలో రామ్ నటిస్తాడా? వేరే వాళ్ళతో కేవలం మూవీ మాత్రం నిర్మిస్తాడా అనేది తెలియాల్సి ఉంది. 'ఆంధ్రా కింగ్ తాలుకా' మూవీ విడుదలైన తర్వాత ఓన్ బ్యానర్ కు సంబంధించిన ప్రకటన వస్తుందని తెలుస్తోంది.



# పెళ్లి తర్వాత మెగా కోడలి మొదటి సినిమా

మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కొన్ని రోజులు సినిమాలకు బ్రేక్‌నిచ్చిన విషయం తెలిసిందే. 2023లో వరుణ్ తేజ్‌తో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన లావణ్య సుమారు ఏడాదిపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. అయితే పెళ్లి తర్వాత మెగా కోడలిగా రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిపింది. లావణ్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం సతీ లీలావతి(). భీమిలీ కబడ్డీ జట్టు సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తాతినేని సత్య ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాలపై నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో లావణ్య కోపంతో అరుస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే మూవీ భార్య భర్తలమధ్య ఉన్న అనుబంధం ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్‌గా బినేంద్ర మీనన్, ఎడిటింగ్ బాధ్యతలను సతీష్ సూర్య చేపడుతున్నారు. మరోవైపు లావణ్య- వరుణ్ దంపతులు త్వరలోనే తల్లిదండ్రులం కాబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు.




# నిహారికకు ఇష్టం లేకుండా పెళ్లి చేశాం..

మెగా బ్రదర్ నాగబాబు ప్రస్తుతం ఒక పక్క రాజకీయాలతో బిజీగా ఉన్నా కూడా అప్పుడప్పుడు పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా మారాడు. ఇక చాలా రేర్ గా యూట్యూబ్స్ కి ఇంటర్వ్యూలు ఇచ్చే నాగబాబు తాజాగా ఒక యూట్యూబ్ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పిల్లల గురించి మాట్లాడాడు. నాగబాబుకు కొడుకు వరుణ్ తేజ్, కూతురు నిహారిక ఉన్నారు. ముకుంద సినిమాతో వరుణ్ హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. మంచి వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ వరుణ్ తనకంటూ అభిమానులను సంపాదించుకున్నాడు. ఏడాది క్రితం హీరోయిన్ లావణ్య త్రిపాఠిని వివాహం చేసుకున్న వరుణ్ కొన్నేళ్లుగా మంచి హిట్ కోసం ఎదురుచూస్తున్నాడు. ప్రస్తుతం వరుణ్ ఒక కొరియన్ హర్రర్ కథ నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నాడు. నిహారిక కొణిదెల.. మెగా కాంపౌండ్ నుంచి ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఏకైక వారసురాలు. ఒక మనసు సినిమాతో ఆమె టాలీవుడ్ కు పరిచయమైంది. అయితే మొదటి సినిమాతోనే విమర్శలు అందుకున్న నిహారిక ఆ తరువాత పలు సినిమాల్లో నటించినా కూడా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది.

# నా బాడీ నా ఇష్టం : శృతిహాసన్

కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ ఎంత స్ట్రైట్ ఫార్వార్డ్ అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనకు సంబంధించిన ఏ విషయం అయిన నిర్మొహమాటంగా చెప్పేస్తుంది. మల్టీ టాలెంటెడ్ అయిన శృతి హాసన్ టీనేజ్‌లో ఉన్నప్పుడే సింగర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టింది. ఆ తర్వాత స్వయంగా ఎన్నో ఆల్బమ్‌లను కూడా రూపొందించింది. ఈ క్రమంలోనే 'హే రామ్' అనే చిత్రంలో చిన్న పాత్రతో నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ లక్ అనే హిందీ చిత్రంలో నిపించింది. ఇక, తెలుగులో వచ్చిన 'అనగనగా ఓ ధీరుడు'తో శృతి హీరోయిన్‌గా జర్నీని స్టార్ట్ చేసింది. అయితే పవన్ కళ్యాణ్ సరసన నటించిన గబ్బర్ సింగ్ చిత్రం శృతి హాసన్ ఫేట్‌ని మార్చేసింది అని చెప్పాలి. కుర్ర హీరోలతోనే కాకుండా సీనియర్ హీరోలతో కూడా శృతి హాసన్ సినిమాలు చేస్తుంది. ఆ మధ్య ప్రభాస్‌తో 'సలార్', బాలకృష్ణతో 'వీరసింహారెడ్డి', చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' మూవీలతో హ్యాట్రిక్ హిట్లు కొట్టింది. త్వరలో సలార్2తో సందడి చేయనుంది. అయితే కెరీర్ పరంగా శృతికి పెద్ద సమస్యలేమి లేవు కాని పర్సనల్ లైఫ్‌లోనే డిస్టబెన్స్ ఎక్కువ అవుతుంది. అప్పట్లో విదేశీ గాయకుడు మైకేల్ కోర్సలేతో డేటింగ్ చేసిన ఈ అమ్మడు అతడిని కమల్ హాసన్‌కు పరిచయం కూడా చేసింది. దాంతో శృతి హాసన్, మైకేల్ కోర్సలే పెళ్లి చేసుకుంటారని అంతా అనుకోగా, కొద్ది రోజులకే వీళ్లు బ్రేకప్ చెప్పుకున్నారు.మైకేల్‌తో విడిపోయిన తర్వాత శృతి హాసన్.. డూడుల్ ఆర్టిస్టు అయిన శాంతను హజారికాతో ప్రేమాయణం కొనసాగించింది. అతడితో ఎంజాయ్ చేసిన ఫొటోలు అన్ని కూడా సోషల్ మీడియాలో షేర్ చేసేది. అతడితో రొమాంటిక్‌గా గడిపింది. కాని ఎందుకో ఏమో శాంతనుకు శృతి హాసన్ బ్రేకప్ చెప్పేసింది. అయితే తాజాగా శృతి హాసన్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. టీనేజ్ లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చకపోవడంతో 'సర్జరీ' చేయించుకున్నాను అని తెలిపింది. ఇక ముఖం మరింత అందంగా కనిపించేందుకు పిల్లర్స్ కూడా వాడాను. కొంత మంది వీటిని బయటకి చెప్పుకోవడానికి ఇష్టపడరు.



# వరుస సినిమాలతో ప్రియాంక మోహన్ బిజీ

హీరోలతో వరుసగా సినిమాలు చేస్తోం ఈ అమ్మడు. పేరుకు మలయాళ నటినే అయినా పక్కింటమ్మాయిలా కని తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరవవుతోంది. తన అందం, అభినయంతో టాలీవుడ్ లో క్రమంగా స్టార్ హీరోయిన్ గా ఎదుగుతోంది. కెరీర్ ప్రారంభంలోనే నాని, శర్వానంద్ లాంటి ప్రామిసింగ్ హీరోలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. ఈ అందాల తార ఇప్పుడు ఏకంగా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ కొట్టేసింది. స్టైలిష్ డైరెక్టర్ సుజిత్ తెరకెక్కిస్తోన్నతెరకెక్కిస్తోన్న ఓజీలో ఈ బ్యూటీనే మెయిన్ హీరోయిన్ గా ఎంపికైంది ప్రియాంక మోహన్. చివరిగా సరిపోదా శనివారంతో బ్లాక్ బస్టర్ మూవీని ఖాతాలో వేసుకుంది ప్రియాంక అరుళ్ మోహన్. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉండే ఆమె రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. మొన్నటివరకు గ్లామర్ డోస్ కు దూరంగా ఉండే ఈ అమ్మడు ఇప్పుడు తన బ్యూటీ ఫుల్ ఫోటోలతో అభిమానులను మెప్పిస్తుంది. 2019లో కన్నడ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ప్రియాంక మోహన్. అదే సంవత్సరం న్యాచురల్ స్టార్ నాని 'గ్యాంగ్ లీడర్' సినిమాతో తెలుగు సినిమాకు పరిచయమైందీ అందాల తార. ఆతర్వాత శర్వానంద్ తో శ్రీకారం సినిమాలో నటించింది. ఆతర్వాత టాలీవుడ్ లో గ్యాప్ ఇచ్చింది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు అభిమానులను కవ్విస్తున్నాయి. చీరకట్టులో అందాలు ఒలకబోస్తూ క్రేజీ ఫోటోలను పంచుకుంది. ఈ ఫోటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అమ్మడి అందాలను పొగుడుతూ కామెంట్స్ చేస్తున్నారు.

